సాక్షి రంగారెడ్డి
శుక్రవారం, 3, జనవరి, 2025



కాటేస్తున్న కాలుష్యం

జనవాసాల మధ్య ఏర్పాటు చేసిన కర్మాగారాలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అనారోగ్యం పాలవుతున్నారు. 8లో▸



ఆటో బోల్తా, ఒకరు మృతి

ఆటో బోల్తాపడిన సంఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో పన్నెండు మంది స్వల్పంగా గాయపడ్డారు. 8లో▸



అవగాహన కల్పించాలి

గ్రామీణ ప్రాంత ప్రజలకు చట్టాలు, న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

రెట్టింపు ఉత్సాహంతో పని చేయండి: కలెక్టర్



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సరికొత్త ఆలోచనలు, ఆశయాలతో 2025 సంవత్సరంలో మరింత పట్టుదలతో పని చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఉద్యోగులకు సూచించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి జిల్లాను మరింత ప్రగతి పథంలోకి తీసుకురావాలని కోరారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రతిశాఖ తన పని తీరును మెరుగుపరుస్తూ నాణ్యతను పెంచుతూ కార్యాచరణ సిద్ధం చేసుకోని ముందుకెళ్లాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే మనందరి బాధ్యత అన్నారు. ప్రతి పనిని పాజిటివ్ ఆలోచనతో చేయాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని అధిగమించగలమన్నారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రెటరీ అసోసియేషన్, మండల పంచాయతీ అధికారుల అసోసియేషన్ సహకారంతో సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు 200 బ్లాంకెట్స్, 100 నోట్ బుక్స్‌ను కలెక్టర్‌కు అందజేశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ కాదు.. ఫ్యూచర్‌సిటీనే..

యాచారం: యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల సరిహద్దులో ఫార్మాసిటీ రాబోదని, ఫ్యూచర్‌సిటీనే ఏర్పాటు చేస్తామని.. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన పలువురు రైతులు గురువారం యాచారంలోని ఆయన నివాసంలో ముదిరెడ్డి కోదండరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీకి భూములు సేకరించిన ప్రాంతంలోనే ఫ్యూచర్‌సిటీని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. కొందరు ఫార్మాసిటీ వస్తుందని.. ఫార్మాసిటీ వస్తే ఈ ప్రాంతం సర్వనాశనమవుతుందని.. బ్యానర్లు, ఫ్లెక్సీలు పట్టుకుని గ్రామాల్లో తిరిగి ప్రజలను అయోమయానికి గురి చేయడం సరైంది కాదన్నారు. సంక్రాంతిలోపు మీరాఖాన్‌పేటలోని టీజీఐఐసీ వెంచర్‌లో రైతుల పేర్లపై రిజిస్ట్రేషన్లు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నాయిని సుదర్శన్‌రెడ్డి, బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై అత్యాచారయత్నం

మొయినాబాద్: నాలుగేళ్ల చిన్నారిపై ఓ యువకుడు అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. బాలిక కేకలు వేయడంతో స్థానికులు వెంబడించి దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మొయినాబాద్ మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల జిల్లా ధారూర్ మండలానికి చెందిన ఓ కుటుంబం మొయినాబాద్‌కు వలస వచ్చింది. కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో వారి కూతురు (4) బహిర్భూమికి వెళ్లింది. చిలుకూరు గ్రామానికి చెందిన యువకుడు కైలాష్ బాలికను చెట్లపొదల్లోకి లాక్కెళ్లి అత్యాచారయత్నం చేశాడు. బాలిక కేకలు వేయడంతో గమనించిన మరో చిన్నారి స్థానికులు, కుటుంబ సభ్యులకు చెప్పింది. అందరూ వెళ్లేసరికి బాలికను వదిలేసి పరుగులు తీశాడు. స్థానికులు వెంబడించి పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం మొయినాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ వర్సిటీ కేలండర్, డైరీ ఆవిష్కరణ



బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ నూతన సంవత్సర డైరీ, కేలండర్‌లను గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యూనివర్సిటీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు.

వడివడిగా గ్రీన్‌ఫీల్డ్

ఔటర్ టు ఆకుతోటపల్లి

- రెవెన్యూ శాఖ నోటిఫికేషన్ జారీ
- తొలి విడతలో 20 కి.మీ.. 449 ఎకరాలు
- రెండో విడతలో 21.5 కి.మీ.. 554.35 ఎకరాలు.. 330 అడుగుల రహదారి
- భూ సేకరణ కోసం రెండు విడతల్లో నోటిఫికేషన్లు
- రహదారి నిర్మాణానికి రూ.2 వేల కోట్ల మంజూరుకు ఆర్థిక శాఖ పచ్చజెండా



కొంగర- మీర్‌ఖాన్‌పేట మధ్యలో సర్వే చేపడుతున్న సిబ్బంది

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఔటర్ నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా ఆకుతోటపల్లి వరకు నిర్మించతలపెట్టిన ఎలివేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనుల భూసేకరణ వడివడిగా ముందుకు సాగుతోంది. ఇటు ఔటర్ నుంచి అటు ఆర్‌ఆర్‌ఆర్ వరకు ఎలాంటి మలుపులకు ఆస్కారం లేకుండా 330 అడుగుల విస్తీర్ణంలో నేరుగా విశాలమైన రోడ్డును నిర్మించే పనులు వేగవంతం అయ్యాయి. రావిర్యాల ఎగ్జిట్ 13 నుంచి ఆర్‌ఆర్‌ఆర్ వరకు సుమారు 41.5 కిలోమీటర్ల పరిధిలోని ఈ రోడ్డు పనులను రెండు విడతల్లో చేపట్టనున్నారు. భూసేకరణ కోసం ఇప్పటికే ప్రభుత్వం రెండు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసింది. రోడ్డు నిర్మాణ పనుల కోసం రూ.2 వేల కోట్ల మంజూరుకు ఆర్థికశాఖ అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. భూ సేకరణ పూర్తయిన వెంటనే టెండర్ల ప్రక్రియ సహా పనులను ప్రారంభించే అవకాశం ఉంది.

ఆరు మండలాలు.. 14 గ్రామాలు

మొదటి విడతలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కందుకూరు మండలాల పరిధిలోని తొమ్మిది గ్రామాల మీదుగా 20 కిలోమీటర్ల దూరం చేపట్టనున్న రోడ్డుకు 449.27 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ సహా మార్కింగ్ ప్రక్రియ పూర్తయింది. రెండో విడతలో యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల పరిధిలోని ఐదు గ్రామాల పరిధిలో 21.5 కిలోమీటర్లు చేపట్టనున్నారు. ఈ రోడ్డు కోసం 554.35 ఎకరాల భూ సేకరణకు సర్కార్ నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 4,725 మంది రైతుల నుంచి 1,004.22 ఎకరాలు సేకరించనున్నట్లు పేర్కొంది. ఆయా సర్వే నంబర్లలో భూ క్రయ విక్రయాలు, అభివృద్ధి పనులను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భూసేకరణపై అభ్యంతరాలుంటే 60 రోజుల్లో లిఖితపూర్వకంగా కలెక్టర్‌కు తెలియజేయాల్సిందిగా సూచించింది. దీనిలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు భూసేకరణ చట్టం ప్రకారం పారదర్శకంగా, హేతుబద్ధమైన పరిహారం చెల్లించనున్నట్లు పేర్కొంది.

రెండువైపులా ల్యాండ్ పూలింగ్

ఎలివేటెడ్ కారిడార్ వెంట మెట్రోలైన్ విస్తరణ పనులు చేపట్టడంతో పాటు రోడ్డుకు రెండు వైపులా 60: 40 నిష్పత్తిలో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ల్యాండ్ పూలింగ్ చేపట్టాలనే ప్రతిపాదనను సైతం తెరపైకి తీసుకొస్తోంది. ఎత్తయిన భవనాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలతో పాటు గేటెడ్ కమ్యూనిటీలు, విల్లా ప్రాజెక్టులను పెద్ద ఎత్తున తేవాలని యోచిస్తోంది. చేపట్టే నిర్మాణాలన్నీ ఏకరూపంగా ఉండేలాప్లాన్ చేస్తోంది. రోడ్డుకు రెండు వైపులా అందమైన, ఎత్తయిన మొక్కలను నాటించడం ద్వారా అహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడనుంది. నెట్‌జీరో సిటీగా ఆవిష్కరించనుంది. అంతేకాదు ఇందుకు భూములు ఇచ్చిన రైతులు కూడా లబ్ధి పొందే అవకాశం ఉంది.

మొదటి విడతలో భూ సేకరణ

మండలం	గ్రామం	రైతులు	భూమి (ఎకరాల్లో)
ఇబ్రహీంపట్నం	ఫిరోజ్‌గూడ	84	1.03
ఇబ్రహీంపట్నం	కొంగరకలాన్	361	55.05
మహేశ్వరం	కొంగరకుర్దు	278	53.20
కందుకూరు	లేమూరు	497	84.28
కందుకూరు	తిమ్మాపూర్	290	47.02
కందుకూరు	రాచలూరు	351	87.22
కందుకూరు	గుమ్మడవెల్లి	(రిజర్వ్డ్ ఫారెస్ట్)	32.11
కందుకూరు	పంజాగూడ	(టీఎస్ఐఐసీ)	18.33
కందుకూరు	మీర్‌ఖాన్‌పేట	48	62.08

రెండో విడతలో భూ సేకరణ

మండలం	గ్రామం	రైతులు	భూమి (ఎకరాల్లో)
ఆమనగల్లు	ఆమనగల్లు	331	68.35
ఆమనగల్లు	ఆకుతోటపల్లి	229	83.35
యాచారం	కుర్మిద్ద	529	144.75
కడ్తాల్	కడ్తాల్	440	72.67
కడ్తాల్	ముద్వీన్	1,287	184.76

'ఇస్తేమా'కు అంతా సిద్ధం

- శంకర్‌పల్లిలో నేటి నుంచి మూడురోజుల పాటు కార్యక్రమం
- ధార్మిక ఉపదేశాలు ఇవ్వనున్న మత గురువులు
- పెద్ద సంఖ్యలో హాజరుకానున్న ముస్లింలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ప్రభుత్వ యంత్రాంగం

సాక్షి,సిటీబ్యూరో: శంకర్‌పల్లిలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు తబ్లీకి జమాత్ ఇస్తేమా జరగనుంది. ఈ సమ్మేళనానికి లక్షల సంఖ్యలో ముస్లింలు హాజరుకానున్నారు. ఈ మేరకు 200 ఎకరాల విస్తీర్ణంలో సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో మైనార్టీలు హాజరు కానుండడంతో ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా సౌకర్యాలు కల్పిస్తోంది. ఇస్తేమాలో మతగురువులు ఇస్లాం ధర్మం ముఖ్య అంశాల గురించి ఉపదేశాలు చేయనున్నారు. మౌలానా అస్లం నాగ్‌పూరీ, మౌలానా ఖాసీం ఖురేషీ, మౌలానా షౌకత్ షితాపూరీ, మౌలానా మహ్మద్ ముస్తాఖ్ ఖాస్మీతోపాటు పలువురు మత ప్రముఖులు వివిధ అంశాలపై ధార్మిక ఉపదేశాలు ఇవ్వనున్నారు. ఆయా జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే వారికోసం ఎక్కడివారు అక్కడే వంట చేసుకోవడానికి, విశ్రమించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. సమ్మేళనానికి లక్షల సంఖ్యలో ముస్లింలు వస్తున్నందున పోలీసుశాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.

వైద్య సేవలు అందించాలి



ఇస్తేమా జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వరావు, సిబ్బంది

శంకర్‌పల్లి: పట్టణ శివారులో ఈనెల 3,4,5 తేదీల్లో నిర్వహించే ఇస్తేమా కార్యక్రమంలో 24గంటల పాటు వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరావు అన్నారు. ఇస్తేమా జరిగే ప్రదేశాన్ని గురువారం ఆయన వైద్యాధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం శంకర్‌పల్లి పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రబాబుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. ఇస్తేమా జరిగే ప్రదేశంలో రెండు ఆస్పత్రులు, ఐదు క్లినిక్స్, ప్రతి రోజు 32 మంది(మూడు షిఫ్టుల్లో) సిబ్బంది విధులు నిర్వర్తించాలని, రెండు అంబులెన్సులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇస్తేమా వారి ప్రత్యేక వైద్య బృందాలు సైతం ఉంటాయని, వారితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. మూడు రోజుల పాటు ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్య సాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి పీహెచ్‌సీ వైద్యురాలు డా.రేవతిరెడ్డి, టంగటూర్ పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

చేవెళ్ల: శంకర్‌పల్లిలో జరుగుతున్న ఇస్తేమా కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల మళ్లింపులు చేపట్టినట్లు చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటేశం తెలిపారు. ఉన్నతాధికారుల సూచనతో మళ్లింపు చేపడుతున్నట్లు చెప్పారు. వాహనదారులు గమనించాలని సూచించారు.

- తాండూరు, వికారాబాద్ నుంచి సంగారెడ్డి పటాన్‌చెరు వైపు వెళ్లే భారీ వాహనాలు మోమిన్‌పేట సదాశివపేట నుంచి సంగారెడ్డి, పటాన్‌చెరుకు వెళ్లాలి.
- తాండూరు, వికారాబాద్ నుంచి సంగారెడ్డి, బీడీఎల్, పటాన్‌చెరుకు వచ్చే భారీ వాహనాలు ముత్తంగి టోల్‌గేట్ వద్ద ఓఆర్‌ఆర్ ఎగ్జిట్-3 ద్వారా చేవెళ్ల - టీఎస్‌పీఏ- ఓఆర్‌ఆర్ ద్వారా వెళ్లాలి.
- పరిగి, షాద్‌నగర్ నుంచి సంగారెడ్డి, ఓడీఎఫ్ పటాన్‌చెరు వెళ్లే భారీ వాహనాలు శంషాబాద్ ఓఆర్‌ఆర్- నార్సింగి, ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ -3 మీదుగా ముత్తంగి లోట్‌గేట్ నుంచి పటాన్‌చెరు - ముంబై హైవే మీదుగా ప్రయాణించాలి.
- సంగారెడ్డి, పటాన్‌చెరు, బీడీఎల్ నుంచి షాద్‌నగర్ పరిగి వైపు వచ్చే భారీ వాహనాలు ఓఆర్‌ఆర్ ఎగ్జిట్-3 మీదుగా ముత్తంగి టోల్‌గేట్- శంషాబాద్ ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ 16- బెంగళూరు హైవే షాద్‌నగర్ మీదుగా వెళ్లాలి.
- నార్సింగి నుంచి శంకర్‌పల్లికి వచ్చే భారీ వాహనాలను టీఎస్‌పీఏ నార్సింగి- మొయినాబాద్- చేవెళ్ల- వికారాబాద్ మీదుగా మళ్లించనున్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ మల్లురవి, చిత్రంలో కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీచంద్‌రెడ్డి

క్రీడా రంగానికి ప్రోత్సాహం

నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి

కడ్తాల్: రాష్ట్రంలో క్రీడా రంగాన్ని ప్రోత్సాహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీల ఏర్పాటుకు కృషి చేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. మండల కేంద్రంలో గూడూరు నారాయణరెడ్డి స్మారకార్థం ఆయన కుమారుడు జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వనపర్తిలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం జరుగుతోందని తెలిపారు. వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలుగులోకి తెచ్చే విధంగా ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తోందని అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛంద వైద్య సేవలు అభినందనీయం

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

కడ్తాల్: ట్రస్ట్‌ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు స్వచ్ఛంద వైద్య సేవలు అందించడం అభినందనీయమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, రాధాకృష్ణ ట్రస్ట్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యా శిబిరాన్ని గురువారం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఐపీఎస్ మాజీ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్ పర్సన్ రజనీసాయిచంద్, మిషన్‌భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో నగరానికి నలు దిక్కులా నాలుగు అత్యాధునిక టిమ్స్ ఆస్పత్రులను మంజూరు చేసి, పనులు ప్రారంభించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు విద్య, వైద్యం సక్రమంగా అందితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, ఎల్‌హెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మందులు అందజేస్తున్న సబితారెడ్డి

కొలిక్కిరాని 'రైతు భరోసా'!

- సంక్రాంతి నుంచి అమలు చేస్తామన్న సర్కార్
- ఇప్పటికీ ఖరారు కాని విధివిధానాలు
- రైతుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ



షాబాద్ మండలం అంతారంలో శనగ సాగు

షాబాద్: రైతులకు వెన్నుదన్నుగా నిలవాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది. పంటల సాగు ఖర్చుల కోసం ప్రైవేట్ వ్యాపారులు, పెట్టుబడిదారులను ఆశ్రయించొద్దని, ఆత్మహత్యలు నివారించేందుకు ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతుభరోసా పథకం కింద ఏటా రూ.15వేలు పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా పథకం అమలుకు సంబంధించి విధివిధానాలు ఖరారు కాలేదు. సంక్రాంతి నుంచి అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ ప్రక్రియ కొలిక్కి రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజుకో అంశం తెరపైకి వస్తుండటంతో అందరిలో ఆందోళన మొదలైంది.

సాగులో ఉన్న భూములకే..

గత ప్రభుత్వం వ్యవసాయ భూములన్నింటికీ ఏడాదికి ఎకరాకు రూ.5వేల చొప్పున రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందించింది. భూపరిమితి విధించలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పథకం అమలులో కొన్ని షరతులు విధించే అవకాశం కనిపిస్తోంది. గతంలో మాదిరిగా వ్యవసాయ భూములన్నింటికీ కాకుండా సాగులో ఉన్న భూములకు మాత్రమే ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. గతంలో కొండలు, గుట్టలు, వెంచర్లకు సైతం పెట్టుబడి సాయం అందిస్తే ప్రజాధనం వృథా అవుతుందనే అభిప్రాయం వ్యక్తమైంది. అయితే సాగులో ఉన్న భూములను ఎలా గుర్తిస్తారు. ప్రత్యేకంగా సర్వే చేపడుతారా లేక శాటిలైట్ ద్వారా వివరాలు సేకరిస్తారా అనేది ప్రభుత్వం ఇంకా ఎటూ తేల్చలేదు. గతంలో పడావు ఉన్న భూములకు సైతం యజమానులు రైతుబంధు సాయం అందుకునేవారు. వర్షాకాలంలో సాగయ్యే పంటలతో పోల్చితే యాసంగిలో సాగయ్యే పంటల విస్తీర్ణం తక్కువగా ఉంటుంది. వానాకాలం పంటల సాగు విస్తీర్ణం లెక్కలోకి తీసుకుని రైతుభరోసా అందిస్తుందా వానాకాలం, యాసంగి సీజన్లకు వేర్వేరుగా అందిస్తుందా అనేది తెలియాల్సి ఉంది. మార్గదర్శకాలు విడుదలైతేగానీ స్పష్టత వచ్చే అవకాశం లేదు.

ఏడాదిగా ఎదురుచూపులు

జిల్లాలోని రైతులు రైతు భరోసా కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్నారు. గత డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పాతపద్ధతిలో యాసంగి పెట్టుబడి సాయం అందించింది. వానాకాలం సీజన్ నుంచి రైతుభరోసా పథకం అమలు చేస్తామని ప్రకటించింది. విధివిధానాల రూపకల్పన జరగకపోవడంతో ప్రారంభం కాలేదు. తాజాగా సంక్రాంతి నుంచి అమలు చేస్తామని ప్రకటించింది. మరో 13 రోజులు మాత్రమే మిగిలి ఉండగా ఇప్పటికీ విధివిధానాలు ఖరారు చేయలేదు. రైతుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది.

ఎన్ని ఎకరాలకు సీలింగ్?

వానాకాలంలో సీజన్‌లో జిల్లా రైతులు సుమారు 1.6లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. యాసంగిలో 38 వేల ఎకరాల్లో మాత్రమే సాగు ఉంటుంది. స్థానికంగా ఆశించిన స్థాయిలో సాగునీటి వనరులు లేకపోవడంతో రైతులు ప్రధానంగా వర్షాధార పంటలకే మొగ్గు చూపుతారు. వానాకాలంతో పోల్చితే యాసంగిలో సాగు విస్తీర్ణం భారీగా తగ్గుతుంది. వీటితోపాటు పంటలు, తోటలు, కూరగాయల సాగు మరో 22,500 ఎకరాల వరకు ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం రైతుభరోసా పథకం అమలులో భూపరిమితి విధించే అవకాశాలు ఉన్నాయి. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోవాలని భావిస్తోంది. ఏడెకరాలా లేక పదెకరాలా అనేది ఇంకా నిర్ణయం కాలేదు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం మార్గదర్శకాలనూ సైతం పరిగణలోకి తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. నూతన మార్గదర్శకాలతో చాలామంది పథకానికి దూరం కానున్నారు.

షరతులు విధించొద్దు



రైతుభరోసా పథకంలో ఎలాంటి షరతులు విధించొద్దు. రైతులందరికీ వర్తింపజేయాలి. అర్హులకు లబ్ధి చేకూరేలా విధివిధానాలు రూపొందించాలి. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినా విధివిధానాలు ప్రకటించకపోవడం బాధాకరం.

– యాదవరెడ్డి, రైతు, బొబ్బిలిగామ, షాబాద్ మండలం

సీలింగ్ లేకుండా అందించాలి



రైతుభరోసా పథకం అమలులో భూపరిమితి విధిస్తే చాలా మంది రైతులు దూరమయ్యే ప్రమాదం ఉంది. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని అందరికీ కలిపి పెట్టుబడి సాయం చేస్తే రైతులను మోసం చేసినట్లే. సీలింగ్ లేకుండా సాయం అందించాలి.

– సత్యనారాయణరెడ్డి, రైతు, సంకెపల్లిగూడ, షాబాద్ మండలం

అర్హులకు అన్యాయం చేయొద్దు



పంటలు సాగు చేస్తున్న రైతులకు అన్యాయం చేయొద్దు. అందరికీ మేలు జరిగేలా రైతుభరోసా పథకం విధివిధానాలు రూపొందించాలి. ఇప్పటికే వేలాది మందికి రుణమాఫీ కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

– బంట్టు కిష్టయ్య, రైతు, లక్ష్మరావుగూడ, షాబాద్ మండలం

బడుగుల ఆర్థిక ప్రగతికి తోడ్పాటు

- సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి
- నాగర్‌కర్నూల్‌ ఎంపీ మల్లు రవి
- బ్యాంకు మేనేజర్లతో సమీక్ష



బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్‌: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి, వారి ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు తోడ్పాటునందించాలని నాగర్‌కర్నూల్‌ ఎంపీ డాక్టర్‌ మల్లురవి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని కెనరా, యూనియన్‌, ఎస్‌బీఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంకులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ సభ్యుడు బాలాజీసింగ్‌లతో కలిసి ఆయా సందర్శించారు. మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. బ్యాంకుల పరిధిలో ఎంఎస్‌ఎంఈ, కేవీఐసీ, ముద్ర, ఎస్‌ఐసీ, విశ్వకర్మ స్కీం, డెయిరీ, ఇటుక బట్టీల తయారీ, ఫుడ్‌ ప్రాసెసింగ్‌, పచ్చళ్ల తయారీ, మహిళా స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న రుణాలు, స్వయం ఉపాధి పథకాల రుణాలు తదితర వాటి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీపై నివేదిక ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణకేంద్రాన్ని నాగర్‌కర్నూల్‌ జిల్లా కేంద్రంలో ప్రారంభించామని తెలిపారు. త్వరలోనే పార్లమెంట్‌ నియోజకవర్గంలో అతి పెద్ద లోన్‌ మేళా నిర్వహించనున్నామని, సుమారు రూ.4 నుంచి 5 వందల కోట్ల మేరకు వివిధ పథకాల కింద లబ్ధిదారులకు రుణాలు ఇవ్వనున్నామని ఆయన వెల్లడించారు. బ్యాంకుల ఆవరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల కింద అందజేస్తున్న రుణాల వివరాలను ప్రదర్శించాలని బ్యాంకర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్‌ వైస్‌ చైర్మన్‌ భాస్కర్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్లు విజయకుమార్‌, కమలాకర్‌, కిరణ్‌, రాజ్‌కుమార్‌, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, సింగిల్‌విండో డైరెక్టర్‌ శ్రీనివాస్‌, రవితదితరులు ఉన్నారు.

కాటేస్తున్న కాలుష్యం

జనావాసాల మధ్య ఉన్న కర్మాగారాలతో పట్టణ ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాటి నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, రసాయనాలతో గాలి, నీరు కలుషితమై అనారోగ్యం పాలవుతున్నారు. కాలుష్యపు కోరల నుంచి కాపాడాలని పోరుబాట పట్టినా.. పట్టించుకునే వారు కరువయ్యారు.

- జనావాసాల్లో పరిశ్రమలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- ఆదిబట్లలో ఆందోళన బాట
- పట్టించుకోని పాలకులు, పీసీబీ అధికారులు



బొంగ్లూర్‌ సమీపంలోని పరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగ (ఇన్‌సెట్లో) రైస్‌మిల్లు నుంచి..



ఇబ్రహీంపట్నం రూరల్‌: ఆదిబట్ల మున్సిపాలిటీలోని బొంగ్లూర్‌, ఎంపీపటేల్‌గూడ, మంగళ్‌పల్లిలో శ్రీశ్రీ అంతఃపురం, శివారెడ్డి నగర్‌, మెట్రోసిటీ, మైహోమ్స్‌ కాలనీ, సీఎంఆర్‌ రిచ్‌ మిడాస్‌, సప్తగిరి, గంగానగర్‌ కాలనీలలో సుమారు రెండు వేల మంది ప్రజలు నివాసం ఉంటారు. అటు హైదరాబాద్‌ ఇటు ఇబ్రహీంపట్నంకు మధ్యలో అనువైన ప్రదేశం కావడంతో ఈ ప్రాంతంలో అనేక మంది నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. టీసీఎస్‌ ఉద్యోగులు, కలెక్టరేట్‌ ఉద్యోగులు, సామాన్య ప్రజలు సైతం నివాసం ఉంటున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. క్రమంగా పెరుగుతున్న కర్మాగారాల సంఖ్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలుష్యకోరల్లో చిక్కుకుని అల్లాడిపోతున్నారు.

నలభై పరిశ్రమలు

నగరానికి, కలెక్టరేట్‌ తదితర కంపెనీలకు పురపాలిక ప్రాంతం అనువైనదిగా పేరు గాంచింది. దీంతో ఈ ప్రాంతంలో అనేక మంది నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు, చేసుకుంటూనే ఉన్నారు. ఇళ్లతో పాటే జనవాసాలకు చేరువగా చుట్టూరా సుమారు 40 వరకు పరిశ్రమలు ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. రైస్‌మిల్లులు, ప్లైవుడ్‌, ఆయిల్‌, బిస్కెట్‌, కుర్‌కురేతో పాటు చిన్నచిన్న కంపెనీలు భారీగానే వెలిశాయి. వీటి నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, రసాయనాలతో గాలీ, నీరు కలుషితమై.. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పొగ నుంచి వచ్చే దుమ్ముధూళి కణాలతో అస్వస్థతకు గురవుతున్నారు. ఇప్పటికే పది మందికి పైగా చర్మ, ఊపిరి సంబంధిత రోగాలతో ఆస్పత్రుల పాలయ్యారని స్థానికులు పేర్కొంటున్నారు.

ఉద్యమాలు చేసినా..

కాలుష్యంతో కలత చెందిన ప్రజలు.. ఏకంగా కాలుష్య వ్యతిరేఖ పోరాట సమితి పేరుతో కొంతకాలంగా పోరాటం చేస్తున్నారు. కాలుష్య కారక కంపెనీలను తరలించాలని కలెక్టర్‌, ఆదిబట్ల మున్సిపాలిటీ, పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బొంగ్లూర్‌ చౌరస్తాలో ధర్నా, రస్తారోకోలు చేపట్టారు. పటేల్‌గూడలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ.. ఏ అధికారులు స్పందించడం లేదని ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రజలను కాపాడండి..



కాలుష్య కారక కంపెనీలను తరలించాలని చాలా కాలంగా పోరాటం చేస్తున్నాం. పార్టీలకు అతీతంగా మున్సిపాలిటీ ప్రజలు ఉద్యమిస్తున్నప్పటికీ.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి. కాలుష్యం నుంచి ప్రజలను కాపాడాలి. లేని పక్షంలో ఉద్యమం తీవ్రం చేస్తాం.

– జి.నర్సింహారెడ్డి, స్థానికుడు, ఎంపీపటేల్‌గూడ

ఇళ్లను వదిలిపెడతాం..



కాలుష్యం వెదజల్లుతున్న కంపెనీలతో పుర ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఆ కర్మాగారాలను జనవాసాలకు దూరంగా తరలించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి. లేదంటే ఇళ్లను వదిలిపెట్టి వెళ్లిపోవాల్సి వస్తుంది. అధికారులు వెంటనే స్పందించాలి.

– రాజు, కాలుష్య వ్యతిరేక పోరాట సమితి నాయకుడు

ఆంటీ అని పిలిచి.. మంగళసూత్రం అపహరణ

మొయినాబాద్‌: గుర్తుతెలియని దుండగుడు ఇంటి తలుపుతట్టి మహిళ మెడలోంచి మంగళసూత్రం అపహరించాడు. ఈ సంఘటన మండల పరిధి చిలుకూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుణాల సబిత, తోటి కోడలు జయమ్మ గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంట్లో నిద్రిస్తున్నారు. అదే సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆంటీ అని పిలుస్తూ ఇంటి తలుపుతట్టాడు. సబిత నిద్రలేచి తలుపుతీసింది. దుండగుడు ఆమె మెడలో నుంచి తాళిని లాక్కొని పారిపోతుండగా.. కేకలు వేసింది. చుట్టుపక్కల వచ్చే సరికి.. దొంగ ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనాన్ని తప్పించబోయి ప్రమాదం

కుల్కచర్ల: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మండలంలోని సాల్వీడు గ్రామానికి చెందిన చీపిరి అంజిలయ్య కుల్కచర్ల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్న క్రమంలో పాంబండ దేవాలయ సమీపంలో ఎదురుగా కారు రావడంతో తప్పించబోయి కింద పడ్డాడు. తీవ్ర గాయాలై ఆయన్ని గమనించిన స్థానికులు 108కి సమాచారాన్ని అందించి పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం నిమిత్తం అతన్ని నగరంలోని నిమ్స్‌ తరలించినట్లు సమాచారం. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

14 మంది ఎంఎల్‌హెచ్‌పీల నియామకం



నియామకపత్రాలు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

అనంతగిరి: జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో గురువారం 14మంది నూతన ఎంఎల్‌హెచ్‌పీలకు నియామకపత్రాలు అందజేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ వెంకటరవణ తెలిపారు. రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్‌ అండ్‌ రోస్టర్‌ ప్రకారం వీరిని నియమించామని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, విధులను నిర్లక్ష్యం చేయొద్దని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు జీవరాజు, రవీంద్ర పాల్గొన్నారు.

పొలం పనులకు వెళ్తుండగా..

లారీ–బైక్‌ ఢీకొని వ్యక్తి దుర్మరణం



శాంతకుమార్‌ మృతదేహం

పరిగి: పొట్టకూటి కోసం నగరానికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తున్న ఓ కార్మికుడిని రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. ఈ విషాద సంఘటన గురువారం ఉదయం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌ తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా సేడెం తాలూకా మాల్కెడ్‌ గ్రామానికి చెందిన శాంతకుమార్‌(36) బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. స్వగ్రామంలో పొలం పనుల నిమిత్తం ఉదయం నగరం నుంచి తన బైక్‌పై గ్రామానికి బయలు దేరాడు. పరిగి పట్టణ సమీపంలోని ఏబీ ప్లాజా వద్ద కర్ణాటక నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తున్న లారీ అతన్ని ఢీకొట్టింది. దీంతో శాంతకుమార్‌ తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి బాబాయి నర్సప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బొంరాస్‌పేట: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. నగదుతోపాటు దుండగులు పెట్రోల్‌ను దొంగిలించారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని బురాన్‌పూర్‌లో హోటల్‌ బాలరాజు ఇంటి తాళం పగులగొట్టి రూ.5 వేల నగదు, 20 లీటర్లున్న పెట్రోలు డబ్బాను అపహరించారు.

కడుపునొప్పి భరించలేక ఇద్దరి ఆత్మహత్య



ప్రవీణ్‌ (ఫైల్‌)

మంచాల: పశువుల పాకలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారెడ్డి గూడ గ్రామానికి చెందిన కావలి ప్రవీణ్‌(22) కడుపునొప్పి భరించలేక గురువారం వారి వ్యవసాయ బావి వద్ద పశువుల పాకలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని పేర్కొన్నారు.

కొత్తూరులో మహిళ..

కొత్తూరు: కడుపునొప్పితో ఓ మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం కల్వకోలు గ్రామానికి చెందిన చిత్ర కల్పన(26)కు కొత్తూరు మండలం మల్లాపూర్‌ గ్రామానికి చెందిన యాదయ్యతో ఆరేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి 5, 4 ఏళ్ల వయసున్న కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్థానికంగా వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా కల్పన తీవ్రమైన కడుపునొప్పితో బాధ పడుతుండేది. ఈ క్రమంలో నొప్పి భరించలేక డిసెంబర్‌ 31న పొలం వద్ద పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉస్మానియ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 1న ఆమె మృతి చెందింది. మృతురాలి తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎంపీడీఓల సంఘం సమావేశం

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

దోమ: మండల పరిషత్‌ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా దోమ మండల ఎంపీడీఓ మహేష్‌ బాబు ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన సంఘ ఎన్నిక కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడిగా మహేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా నవాబుపేట్‌ ఎంపీడీఓ అనురాధ, కోశాధికారిగా ధారూర్‌ ఎంపీడీఓ నర్సింలు, సభ్యులుగా వెంకన్న, విశ్వప్రసాద్‌, ఉషశ్రీ, శ్రీరాములు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా మహేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలను ప్రజలకు చేరవేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి వెళ్లిన బాలుడి అదృశ్యం



సమీర్‌ (ఫైల్‌)

తాండూరు టౌన్‌: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లిదండ్రులు గురువారం పోలీసులను ఆశ్రయించారు. పట్టణ సీఐ సంతోష్‌ కుమార్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పాత తాండూరు గడి ప్రాంతానికి చెందిన మహ్మద్‌ ఫిరోజ్‌ కుమారుడు మహ్మద్‌ సమీర్‌(14) స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. బుధవారం పాఠశాలకు సెలవు కావడంతో మధ్యాహ్నం మజీదులో ప్రార్థన చేసి బయట కొద్ది సేపు కూర్చున్నాడు. రాత్రి అయినా సమీర్‌ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన ఇళ్లల్లో వెతికారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బాలుడు సాయంత్రం రైల్వే స్టేషన్‌ వైపు వెళ్లినట్లు సీసీ ఫుటేజీల్లో కనిపించాడని, అతని కోసం గాలింపు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పది మంది జూదరుల అరెస్టు

బంట్వారం: మండల పరిధిలోని మంగ్రాస్‌పల్లి శివారులో పేకాట స్థావరంపై బంట్వారం పోలీసులు గురువారం దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ శ్రీశైలంయాదవ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కుపల్లి, మంగ్రాస్‌పల్లికి చెందిన 10 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో స్థావరంపై దాడులు నిర్వహించారు. వారి వద్ద నుంచి రూ.4వేల నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా, ఒకరు మృతి

పన్నెండు మందికి గాయాలు



మృతుడు జంగయ్య(ఫైల్‌)



ఘటనా స్థలంలో ఆటో

కొందుర్గు: ఆటో బోల్తాపడిన సంఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో పన్నెండు మంది గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం జిల్లేడ్‌ చౌదరి గూడ మండలం తూంపల్లి చౌరస్తా వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. లాల్‌పహాడ్‌ వైపు నుంచి చౌదరి గూడ వెళ్తున్న ఆటో (ఏపీ 22 ఎక్స్‌ 0318) డ్రైవర్‌ అతివేగం, అజాగ్రత్త వలన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బంగారు జంగయ్య(70) మృతి చెందాడు. మిగతా పన్నెండు మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు.. సంఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం క్షతగాత్రులను, పోస్టుమార్టం కోసం జంగయ్య మృతదేహాన్ని 108 వాహనాల్లో షాద్‌నగర్‌ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి




కేలెండర్‌, డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కోదండరామ్‌

ఎమ్మెల్సీ, ప్రొఫెసర్‌ కోదండరామ్‌

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంత ప్రజలకు చట్టాలు, న్యాయవ్యవస్థపై అవగాహన కల్పించాలని, అప్పుడే వారికి సత్వరన్యాయం పొందడానికి వీలుంటుందని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్‌ కోదండరామ్‌ అన్నారు. గురువారం మండల పరిధి కోనాపూర్‌ గ్రామానికి చెందిన సీనియర్‌ న్యాయవాది, ఆమనగల్లు బార్‌ అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు యాదీలాల్‌ రూపొందించిన నూతన సంవత్సర కేలెండర్‌, డైరీలను నగరంలోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ప్రజా చైతన్యం, సామాజిక సేవా కార్యక్రమాల్లో న్యాయవాదులు తమవంతు కృషి చేయాలని సూచించారు. సేవలను బట్టే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్‌ను యాదీలాల్‌ సన్మానించారు.

కలెక్టర్‌కు న్యూఇయర్‌ విషెస్‌



కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ట్రెసా బృందం

అనంతగిరి: నూతన సంవత్సరం పురస్కరించుకుని గురువారం జిల్లాకు చెందిన ఆయా విభాగాల అధికారులు, వారి సిబ్బందితో కలిసి కలెక్టర్‌ ప్రతీక్‌ జైన్‌కు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా ట్రెసా ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్‌ ఉమా హారతి, ఆర్డీఓ వాసుచంద్ర, ట్రెసా జిల్లా ప్రధాన కార్యదర్శి విజయేందర్‌, కలెక్టరేట్‌ విభాగం అధ్యక్షుడు దీపక్‌, ఏఓ ఫర్హీన్‌ ఖాతైన్‌, తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, వెంకటేష్‌ప్రసాద్‌, నైమాత్‌ అలీ, జయరాం, ఆనంద్‌రావు, గణేష్‌, సాజిదాబేగం, వెంకటేశ్వరి పలువురు డిప్యూటీ తహసీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా ఎంపీడీఓల సంఘం ఆధ్వర్యంలో అడిషనల్‌ కలెక్టర్‌ సుధీర్‌, డీపీఓ జయసుధ సమక్షంలో కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

గైర్హాజరు ఖరీదు రూ.500!


- పది మంది విద్యార్థుల నుంచి రూ.5 వేలు వసూలు
- భయం పెట్టడానికేనని ప్రిన్సిపల్‌ వెల్లడి



విద్యార్థులను తీసుకుని హాస్టల్‌కు వచ్చిన తల్లిదండ్రులు

కొందుర్గు: పేద విద్యార్థులు చదువుకునే సంక్షేమ వసతి గృహంలో కొత్త నిబంధనలకు తెరలేశారు ఓ ప్రిన్సిపల్‌. క్రిస్మస్‌ సందర్భంగా ఇళ్లకు వెళ్లి, సకాలంలో తిరిగి రాకుండా, తరగతులకు గైర్హాజరైన వారి నుంచి రూ.500 చొప్పున వసూలు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా కొందుర్గు సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులు క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఇళ్లకు వెళ్లారు. సెలవుల అనంతరం హాస్టల్‌కు రావాల్సి ఉండగా.. కొంతమంది వారం రోజులు గడిచినా రాలేదు. దీంతో వీరి నుంచి రూ.500 చొప్పున వసూలు చేయాలని ప్రిన్సిపల్‌ ఖుర్షీద్‌ క్లాస్‌ టీచర్లను ఆదేశించారు. సంజాయిషీ లెటర్‌ రాయించుకుని, రూ.500 నగదు లేదా ఫోన్‌ పే చేయించుకున్నారు. ఇలా పది మంది నుంచి రూ.5 వేలు వసూలు చేశారు. విషయం తెలుసుకున్న విలేకరులు వెళ్లి అడగగా.. తల్లిదండ్రులకు డబ్బులు వాపస్‌ చేశారు.

దురుద్దేశం లేదు..



ఖుర్షీద్‌ ప్రిన్సిపాల్‌

ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్‌ ఖుర్షీద్‌ను వివరణ కోరగా ప్రభుత్వం క్రిస్మస్‌ సెలవులు ప్రకటించనప్పటికీ తల్లిదండ్రుల కోరిక మేరకు ఇంటికి పంపించామని తెలిపారు. వారం రోజులైనా తిరిగి రాని వారికి రూ.500 ఫైన్‌ విధిస్తే మరోసారి ఇలా చేయకుండా ఉంటారని డబ్బులు తీసుకున్నట్లు చెప్పారు. రెండు రోజుల తర్వాత తిరిగి ఇచ్చేద్దామనుకున్నామని, ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని తెలిపారు.

తాగు నీటికి ఇబ్బంది

- నాలుగు రోజులుగా ట్యాంకర్‌తో సరఫరా

దుద్యాల్‌: మిషన్‌ భగీరథ పైపు లైన్‌ పగిలి పోవడంతో దుద్యాల్‌ వాసులు ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజులుగా నీటి సరఫరా లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దీంతో పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్‌ ద్వారా నీరు అందిస్తున్నామని కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బంది నిత్యం ట్యాంకర్లలో నీటిని నింపుకొని ఉదయం నుంచి రాత్రి వరకు సరఫరా చేస్తున్నారు. అయినా తమ అవసరాలకు నీరు సరిపోవడం లేదని ప్రజలు మొర పెట్టుకుంటున్నారు. సాధారణ సమయంలో కూడా మిషన్‌ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే మిషన్‌ భగీరథ పైప్‌లైన్‌ పనులకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.